ప్రజాశక్తి
బుధవారం 11 అక్టోబర్ 2023

12, 13 తేదీల్లో ఎస్‌టి కమిషన్ చైర్మన్ పర్యటన

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

ఈనెల 12, 13 తేదీల్లో మండలంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావు పర్యటించనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 12న ఉదయం 12 గంటలకు ఎస్టీ కమిషన్ స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు నుంచి వినతులు స్వీకరిస్తారన్నారు. అనంతరం గిరిజన గురుకుల పాఠశాలల సందర్శన, పిటిజి గిరిజనులు నివసించే గిరిజన గ్రామాలు సందర్శిస్తారని డిడి శ్రీనివాసరావు తెలిపారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

పోస్టుమెట్రిక్ హాస్టల్ ఏర్పాటు చేయాలి

- జూనియర్ కాలేజీలకు పాఠ్య పుస్తకాలు ఇవ్వాలి
- సైకిల్ సంగ్రామ యాత్రలో ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - కొమరాడ

స్థానిక ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో వందలాది మంది విద్యార్థులు చదువుతున్నారని, వీరికి సంక్షేమ హాస్టల్ లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లలేక రోజుల తరబడి తిరగలేక మధ్యలోనే చదువులు ఆపేసే పరిస్థితి ఉందని, కావున కొమరాడలో పోస్టుమెట్రిక్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.పండు డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యాన విద్యార్థులు చేపట్టిన సైకిల్ సంగ్రామ యాత్ర తొమ్మిదవ రోజున కొమరాడకు చేరింది. ఈ యాత్రకు సిఐటియు, గిరిజన, రైతు సంఘం, ఆశా, అంగన్‌వాడీ, వ్యవసాయ కార్మికసంఘాల నాయకులు కొల్లి సాంబమూర్తి, కె.గౌరమ్మ ఎ.ఉపేంద్ర, వెంకటేష్, త్రినాధ, ఆరుద్ర, రాజేశ్వరి, సుజాత, గౌరి, దుర్గమ్మ, కుమారి ఘనస్వాగతం పలికి, సంఘీభావం తెలిపారు. ఈ సంద్భంగా స్థానిక విద్యాసంస్థలను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి డి.పండు, పి.రాజశేఖర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసేలా తమ విధానాలను అనుసరిస్తున్నారని మండిపడ్డారు. మండల కళాశాలకు పోస్టుమెట్రిక్ హాస్టల్ లేకపోవడంతో విద్యార్థులు రోజుల తరబడి 20 కిలోమీటర్ల వరకు సైకిళ్ల తొక్కుకుంటూ, నదులపై పడవలతో దాటుకుంటూ వస్తున్నారని దీనివల్ల ఆర్థికంగా, మానసికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కావున మండల కేంద్రంలో పోస్టుమెట్రిక్ హాస్టళ్లను నిర్మించాలని, కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వాలని, నాన్ టీచింగ్ లెక్చరర్లను నియమించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మండల కేంద్రంలో డైట్ కళాశాల ఏర్పాటుకై ఎస్ఎఫ్ఐ చేపడుతున్న పోరాట కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంక్షేమ హాస్టళ్లకు బకాయిలుగా నిలిచిన మెస్ (డైట్) బిల్లులు వెంటనే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ బిల్లులు పెంచాలని, ఉపాధ్యాయులపై యాప్ల భారం తొలగించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని, మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని, డిగ్రీలో తీసుకువచ్చిన హనర్స్ - మైనర్ సబ్జెక్టు విధానాన్ని రద్దు చేయాలని, డిగ్రీ విద్యార్థులు ఇంటర్న షిప్‌లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, విద్యార్థులకు స్టైఫండ్ ఇవ్వాలని, ఎన్ఇపి రద్దు చేయాలని, 117 జిఒ రద్దు చేయాలని, పాఠశాలల విలీనం ఆపాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, హాస్టళ్లలో పర్మినెంట్ వర్కర్లను, వార్డెన్లను నియమించాలని, పోస్టుమెట్రిక్ హాస్టల్‌కు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని, హాస్టళ్లలో ఎఎన్ఎంలను నియమించాలని లేనిచో సైకిల్‌యాత్ర అనంతరం పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాజు, హెచ్. సింహాచలం, బి.గంగారావు, కె.భాస్కరరావు, నాయకులు అఖిల్, ఉమాశంకర్, సిసింద్రీ, అన్నాజీ, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

కొమరాడలో ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్రకు స్వాగతం పలుకుతున్న ప్రజాసంఘాల నాయకులు

పార్వతీపురంలో సాగుతున్న ఎస్ఎఫ్ఐ సైకిల్ యాత్ర

పార్వతీపురం చేరుకున్న సైకిల్‌యాత్ర

పార్వతీపురంరూరల్ : ఎస్ఎఫ్ఐ విద్యార్థి సైకిల్ సంగ్రామ యాత్ర స్థానిక పాత బస్టాండ్‌కు సాయంత్రం 5 గంటలకు చేరుకుంది. విద్యార్థులకు సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకులు పడాల గాంధీ, నాగవంశం నిర్మల, షాపు వర్కర్స్ యూనియన్ నాయకులు చొక్కాపు మౌళి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు రాజేశ్వరి, ఎం.గౌరీ, అంగన్వాడీ వర్కర్స్ స్వాగతం పలికి వీర తిలకం దిద్ది ఆహ్వానించారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పడాల రాజశేఖర్ మాట్లాడుతూ జిల్లాలో పాచిపెంట నుంచి పార్వతీపురం వరకు 15మండలాల్లో సైకిల్ సంగ్రామ యాత్ర కొనసాగిందన్నారు. జిల్లాలోని విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి పెద్ద ఎత్తున ఆందోళన ఉంటుందన్నారు. ఈ ఆందోళనలో భాగంగా బుధవారం స్థానిక సుందరయ్య భవనం నుండి పాత బస్టాండ్ వరకు సైకిల్ యాత్ర ముగింపు ఉంటుందన్నారు. సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ చేసే ఆందోళనకు సిఐటియు మద్దతు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పండు, భాస్కరరావు, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రమ ఆయుధమైతే విజయం సొంతం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

విద్యార్థులు నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు శ్రమను ఆయుధంగా మలుచుకుంటే విజయం మీ సొంతమవుతుందని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. జిల్లా పర్యటనలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని కొత్తవలస వద్ద చౌక ధరల దుకాణాన్ని, అంగన్వాడీ కేంద్రం, మున్సిపల్ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటకాల నాణ్యతను పరిశీలించి రుచి చూశారు. విద్యార్థులకు స్వయంగా పదార్థాలను వడ్డించారు. స్టోర్ రూంలో సరుకుల నిల్వలను, రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న గుడ్లు, చెక్కీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కొత్తవలస పెద్దవీధిలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి జగనన్న గోరుముద్ద పథకం అమలు, సరుకుల నిల్వ, రికార్డుల నిర్వహణను తనిఖీ నిర్వహించారు. వండిన వంటకాల స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను సక్రమంగా అమలు చేయాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంత మంది బాలింతలు, గర్భిణీలకు పౌష్ఠికాహారం, టి.హెచ్.అర్ అందిస్తున్నది వివరాలను ఆరా తీశారు. రక్తహీనత లోపం తలెత్తకుండా బలవర్ధకమైన ఆహారాన్ని సక్రమంగా అందించాలని సూచించారు. పథకాల అమలు క్షేత్ర స్థాయిలో పక్కాగా అమలు జరిగేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. లోపాలను సరిదిద్దుకుని ప్రభుత్వ ఆశయం నెరవేర్చేందుకు పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. అలాగే కొత్తవలస లోని చౌక ధరల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జీవితం ఎంతో విలువైందని, ఆత్మ స్థైర్యంతో ముందడుగు వేయాలని అన్నారు. పేదరికం, ఆనారోగ్యంతో ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనే ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందని వివరించారు. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి నాణ్యమైన విద్యతో పాటు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని అందిస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఆర్.శివప్రసాద్, డిఎం ఎం.దేవుళ్లనాయక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహన్‌రావు, జిల్లా మధ్యాహ్న భోజన పథకం సహాయ సంచాలకులు పి.దామోదర రావు, జిల్లా ఆహార భద్రత తనిఖీ ఇన్‌స్పెక్టర్ వై.రామయ్య, జిల్లా లీగల్ మెట్రాలజి ఇన్స్పెక్టర్ కె.రత్న రాజు, ప్రధానోపాధ్యాయులు జి.విశ్వం, ఉపాధ్యాయులు, తదితరులు, పాల్గొన్నారు.

రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు కాంతారావు

రేషన్ డిపోను పరిశీలిస్తున్న ఫుడ్‌కమిషన్ సభ్యులు కాంతారావు

పిఒను కలిసిన ఫుడ్ కమిషన్ సభ్యులు

సీతంపేట : రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు బి.కాంతారావు మంగళవారం ఐటిడిఎ పిఒ కల్పనకుమారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో ఉన్న సమస్యలను పిఒ దష్టికి తీసుకురాగా, పరిష్కారానికి అన్ని రకాల చర్యలు తీసుకొంటామని పిఒ హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలను ఫుడ్ కమిషన్ సభ్యులు కాంతారావు సందర్శించారు. విద్యా ప్రమాణాలు అడిగి తెలుసుకున్నారు. మెనూ అమలు తీరును పరిశీలించారు అనంతరం సీతంపేట పాఠశాలను తనిఖీ చేపట్టారు. గురుకుల కళాశాల, ఆశ్రమ పాఠశాలల, కెజిబివి పాఠశాలలను సందర్శించారు. ఆయన వెంట శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల గిరిజనసంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్లు మంగ వేణి, శ్రీనివాసరావు డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి. ప్రిన్సిపల్ తిరుపతిరాజు, ఎఎంఒ కోటి బాబు తదితరులు పాల్గొన్నారు.

పారాది వంతెనపై రాకపోకలకు అనుమతి

10 మెట్రిక్ టన్నుల లోపు ప్రయాణీకుల వాహనాలకే

ప్రజాశక్తి-విజయనగరం

గత కొద్దిరోజులుగా రాకపోకలు నిలిపివేసిన బొబ్బిలి మండలంలోని పారాది వంతెనపై బుధవారం నుంచి ప్రయాణీకుల వాహనాలకు అనుమతించనున్నట్లు రోడ్లు భవనాల శాఖ పర్యవేక్షక ఇంజనీర్ కె.విజయరత్నం తెలిపారు. రోడ్డు వంతెన బలహీనపడటంతో గత వారం రోజులుగా ఈ వంతెనపై భారీ వాహనాల రాకపోకలను నిలిపివేయడం జరిగిందన్నారు. ఈ వంతెనకు గత వారంరోజులుగా అత్యవసర మరమ్మత్తులు చేపట్టి తాత్కాలికంగా పునరుద్ధరించామన్నారు. ఈనెల 11 నుంచి ఈ వంతెనపై బస్సులు, కార్లు, ఇతర ప్రయాణీకుల వాహనాలను మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు. పదిటన్నుల లోపల బరువు కలిగిన వాహనాలు మాత్రమే అనుమతిస్తామని, లారీలు, ట్రక్కులు తదితర సరుకు రవాణా వాహనాలు అనుమతించేది లేదని అన్నారు. ఈ విషయాన్ని ఈ మార్గంలో ప్రయాణించే వారు గుర్తించాలని కోరారు. వంతెన పై పది కిలోమీటర్ల వేగంతోనే ప్రయాణించ వలసి ఉంటుందని సూచించారు.

చీపుర్లుతో ఊడ్చుతూ నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

జీతాల కోసం ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

10వ తేదీ వచ్చినప్పటికీ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించక పోవడాన్ని నిరసిస్తూ యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఆవరణలో ఉపాధ్యాయులు చీపుర్లతో నిరసన తెలిపారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకపోవడాన్ని ప్రభుత్వం తమపై కక్ష సాధింపు చర్యగా భావిస్తున్నామని అన్నారు. మూడు నెలలుగా కెజిబివి సిబ్బంది తోపాటు, సర్వ శిక్ష అభియాన్ సిబ్బంది జీతాలు చెల్లించలేదని, ఇన్ని నెలలుగా జీతాలు చెల్లించకపోతే ఆయా కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్ మాట్లాడుతూ రెండేళ్లగా పాలనాపరమైన గ్రాంట్స్ విడుదల చేయకపోవడం వలన సంబంధిత ప్రధానోపాధ్యాయులు తమ సొంత నిధుల నుండి ఖర్చులు చేయవలసిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని, దసరా సెలవులను దృష్టిలో పెట్టుకొని ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని రద్దు చేయాలని కోరారు. అనంతరం డిఇఒకు వినతి అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి కె.మురళి, కార్యదర్శి ఎన్.శ్రీను, ఎం.పైడిరాజు, కె.భాస్కరరావు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఇంటర్ మార్క్స్ జాబితాలు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మార్చిలో జరిగిన ఇంటర్ పబ్లిక్, అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు 2023లో పాసైన విద్యార్థిని, విద్యార్థుల ఒరిజినల్ మార్కులు లిస్టులు కళాశాలలో అందుబాటులో ఉన్నాయని, కళాశాల పనివాళ్లలో విద్యార్థులు వాటినిపొందవచ్చునని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జె.రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు త్వరగా వచ్చి కళాశాలలో ఒరిజినల్ మార్కుల లిస్టులు తీసుకోవాల్సిందిగా ప్రకటనలో కోరారు.

సమావేశానికి మున్సిపల్ నాయకుల డుమ్మా

చైర్‌పర్సన్ నియామకంలో జాప్యమే కారణమా?

ప్రజాశక్తి - సాలూరు

విజయవాడలో ఇటీవల జరిగిన వైసిపి కీలక సమావేశానికి స్థానిక మున్సిపల్ నాయకులు డుమ్మా కొట్టారు. రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, మండలాల నుంచి పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్మన్లు, జెసిఎస్ కన్వీనర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. సిఎం జగన్ మోహన్ రెడ్డి ఈ సమావేశంలో కీలక ఉపన్యాసం చేశారు. ప్రతి మండలం, మున్సిపాలిటీ నుంచి ఐదుగురు కీలక నాయకులు సమావేశానికి హాజరు కావాలని పార్టీ ఆదేశించింది. అయితే స్థానిక మున్సిపాలిటీ నుంచి పట్టణ పార్టీ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు మాత్రమే హాజరయ్యారు. తన భర్త అనారోగ్యం కారణంగా మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ హాజరు కాలేకపోయారు. వైస్ చైర్ పర్సన్ జర్జాపు దీప్తి, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు హాజరు కాలేదు. పట్టణ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కూడా ఏ ఒక్కరూ హాజరు కాలేదు. నియోజకవర్గంలో మిగిలిన మండలాల నుంచి ముఖ్య నాయకులు హాజరయ్యారు. పట్టణానికి చెందిన ముఖ్య నాయకులు కీలక సమావేశానికి హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. రెండున్నరేళ్ల తర్వాత పెద్ద మనుషుల ఒప్పందం ప్రకారం చైర్‌పర్సన్ మార్పు జరగాల్సి ఉంది. అయితే జిల్లాకు చెందిన అగ్రనేతలు ఈ ఒప్పందం అమలుపై సాకులు చెబుతూ కాలయాపన చేస్తుండడం ఆశావహులు అసంతృప్తితో రగిలిపోతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. మరికొద్ది నెలల్లో ఎన్నికలు ఎదుర్కోనున్న తరుణంలో పట్టణ అధికారపార్టీలో తాజా పరిణామాలు ఎటు దారితీస్తాయనే చర్చ మొదలైంది.

తవ్వకాల అనుమతులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

విజిలెన్స్ అధికారుల దాడి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధిలోని మక్కువ చిన్న భోగిలి రహదారికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ కంకరకొండ వద్ద అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న వాహనాలను విజిలెన్స్ అధికారులు అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేపడుతున్న పలాసకు చెందిన వ్యక్తి నుండి సుమారు రూ.59వేలకు పైబడి అపరాధ రుసుం వసూలు చేశారు. ఎటువంటి ప్రభుత్వ రసీదులు లేకుండా ఎలాంటి తవ్వకాలు చేపట్టకూడదని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. ఇక్కడ క్వారీ నుండి అక్రమంగా కంకరను ఓ లేఅవుట్‌కు తరలిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు అందిన సమాచారం మేరకు ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా మండలంలోని అధికారుల మెతక వైఖరి కారణంగా అక్రమంగా ఎస్.పెద్దవలస రెవెన్యూ పరిధిలోని, శంబర-బట్టివలస రహదారికి ఆనుకొని ఉన్న కొండలను తవ్వేస్తున్నా అధికారులెవరూ పట్టించుకోవడంలేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వీటిపై కూడా ఉన్నతాధికారులు నిఘా పెట్టాలని కోరుతున్నారు.

గ్రామస్తులకు పట్టుబడిన క్షుద్రపూజ నిర్వాహకులు

గొటివాడలో క్షుద్ర పూజల కలకలం

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో గొటివాడ గిరిజన గ్రామంలో సోమవారం అర్ధరాత్రి క్షుద్ర పూజలు ఘటన కలకలం రేపింది. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులు అందించిన సమాచారం ప్రకారం గోటివాడ గ్రామ పరిధిలో గల శ్మశాన వాటికి వద్ద అర్ధరాత్రి 12 గంటల సమయంలో నాలుగు ద్విచక్ర వాహనాలతో 9మంది వ్యక్తులు వచ్చి కత్తులు, పసుపు, కుంకుమలతో క్షుద్ర పూజలు చేస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. అందులో ముగ్గురు పరారీలో ఉన్నారని, వీరు 4 ద్విచక్ర వాహనాలతో వచ్చారని, వీరు ఏ గ్రామస్తులని అడిగితే పెంగావా, రాయఘడాజమ్ము అంటూ సరైన సమాధానం చెప్పడం లేదని స్థానికులు తెలిపారు. శ్మశాన వాటికలో పూజలు చేస్తే మొక్క ఏదో పుట్టుకు వస్తుందని, ఆ మొక్కతో జబ్బులు ఏమైనా ఉంటే నయమవుతాయని అంటున్నారని తెలిపారు. వీరిపై అనుమానంగా ఉందని, తమ గ్రామానికి వచ్చి శ్మశాన వాటిక దగ్గర ఇటువంటి కార్యక్రమాలు చేయడంతో వారిపై అనుమానంగా ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని అన్నారు.

13న వీరఘట్టంలో జగనన్నకు చెబుదాం

ప్రజాశక్తి - పార్వతీపురం

మండల స్థాయిలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమం శుక్రవారం వీరఘట్టం మండలంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుండి జగనన్నకు చెబుదాం కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రజలు తమ అర్జీలను సమర్పించవచ్చని తెలిపారు.

టార్చ్ లైట్ వెలుతురులో చిన్నారికి వైద్యం

ఆస్పత్రిలో పనిచేయని జనరేటర్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పేరుకే ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం. పగటి పూట మాత్రమే మెరుగైన వైద్యం. రాత్రివేళ అయితే అంధకారమే. విద్యుత్ సరఫరా ఉంటే తప్ప ఇక్కడ విద్యుత్ దీపాలు వెలగన పరిస్థితి. వేళాపాలా అన్న తేడా లేకుండా విద్యుత్ కోతలు ఉండడంతో ఒక్కొక్క సమయంలో చీకటిలోనే రోగులకు వైద్యం అందాల్సిన పరిస్థితి. ఇందులో భాగంగానే మంగళవారం రాత్రి విద్యుత్ సరఫరా లేకపోవడంతో చిన్నపిల్లల వార్డులో టార్చ్ లైట్ల వెలుగు మధ్య వైద్యులు వైద్యం అందించిన సంఘటన వెలుగు చూసింది. భద్రగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గల చిన్నపిల్లల చికిత్స విభాగంలో మంగళవారం రాత్రి విద్యుత్ కోత కారణంగా జనరేటర్ పనిచేయక పోవడంతో చిన్నపిల్లలకు వైద్య సహాయం అందించడానికి డాక్టర్లు పడరాని పాట్లు పడుతున్నారు. మంగళవారం రాత్రి 7 గంటలకు పుష్పావను తీసుకువచ్చి వైద్య సహాయం కోసం వచ్చారు కరెంటు లేని కారణంగా జనరేటర్ పనిచేయని కారణంగా సెల్ ఫోన్ లైట్ లలో పుష్పాకు చికిత్స అందించారు.



టార్చ్ లైటు వెలుతురులో చిన్నారికి చికిత్స చేస్తున్న వైద్యుడు

ఎపిఎంకు వినతిని అందజేస్తున్న విఒఎలు

విఒఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బలిజిపేట

వెలుగు విఒఎల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో విఒఎలతో కలిసి ఎపిఎం వైఉమామహేశ్వరరావుకు వినతిని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విఒఎలను దెబ్బతీసే మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, గ్రామ సమైక్య విలీనం ఆపాలని డిమాండ్ చేశారు. విఒఎలను విలీనం చేయడం వల్ల వేలాదిమందికి ఉపాధి పోతుందని విఒఎలకు జండర్ వయసు చదువు పేరుతో తొలగింపు ఆపాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, విఒఎలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, రూ.10 లక్షలతో గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, విఒఎ విలీనం ఆపాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని, యాప్ వర్క్ కోసం 5 జి మొబైల్ ఇవ్వాలని, వాలంటరీ ఐడితో విఒఎలను పనిచేయించరాదని, విఒఎల ఐడి ద్వారా పనిచేయించాలని, విలీనం వల్ల ఉపాధి కోల్పోయిన విఒఎలకు నష్టపరిహారం ఇవ్వాలని, మహిళా మార్టులో సరుకులు కొనుగోలుకై టార్గెట్ ఇచ్చే పద్ధతి రద్దు చేయాలని, కూరగాయలు, ఆకుకూరలు విత్తనాలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, గేదెలు లాంటివి పొదుపు సంఘాలతో బలవంతంగా కొనే పద్ధతి ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భారతి, సత్యవతి, ఉమా, లక్ష్మి, పార్వతి, విఒఎలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి

ఓటర్ల జాబితాలో తప్పుల్లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు దొర్లకుండా అన్ని జాగ్రత్తలు తీసుకొంటున్నామని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులుంటే సరిచేస్తున్నామని, మీ దృష్టిలో ఇంకా ఏవైనా ఉంటే మా దృష్టికి తీసుకురావాలని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఓటరును ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకొంటున్నామన్నారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిల్లల చదువు పట్ల తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థుల చదువుకు తల్లిదండ్రులే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావు అన్నారు. మంగళవారం పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధించడం ఒక ఎత్తు అయితే తల్లిదండ్రులు కూడా ఇంటి వద్ద పిల్లల చదువును పరిశీలించి చదివించాలన్నారు. అలాగే పాఠశాలలో ఏమైనా లోటుపాట్లు ఉంటే తమకు తెలియజేయాలని, అవి సరిదిద్దుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో పోలీసులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పోలీసులు కేవలం ప్రభుత్వ సేవకులే కాదని.. తమకు కూడా సేవా భావం ఉందని నిరూపిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధాన రహదారుల వద్ద ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఆర్ అండ్ బి అధికారులు చేయాల్సిన పనిని పోలీసులు చేసి శభాష్ అనిపించుకుంటున్నారు. గుమ్మలక్ష్మీపురం- కురుపాం ప్రధాన రహదారికి ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి రాకపోకలకు వీలు కల్పించారు. గతంలో కూడా టిక్కబాయి, మండ గ్రామ సమీపంలో రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించడం, ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్లు తొలగించడం వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు అయ్యారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా ఇటువంటి పనులు చేపట్టడం బాధ్యతని ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు.

యోగితను అభినందిస్తున్న పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు

విద్యార్థినికి అభినందన

ప్రజాశక్తి - సాలూరు

అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఇటీవల నిర్వహించిన క్విజ్, డ్రాయింగ్ పోటీల్లో ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థిని అక్కేన యోగితను పాఠశాల హెచ్ఎం దత్తి అప్పలనాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వున్న ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి హాజరైన వెయ్యి మంది విద్యార్థుల్లో యోగిత క్విజ్ పోటీల్లో రెండో స్థానం, డ్రాయింగ్ పోటీల్లో తృతీయ స్థానాల్లో నిలిచింది. విశాఖ జిల్లా రఘు ఇంజనీరింగ్ కళాశాలలో ఈ పోటీలు నిర్వహించారు. వీటిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అక్కేన యోగితను హెచ్ఎంతో పాటు సీనియర్ ఉపాధ్యాయులు కెవి సత్యనారాయణ, పాఠశాల సిబ్బంది దుశ్శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేశారు.

చిరుధాన్యాలతో అధిక లాభాలు

ప్రజాశక్తి - కురుపాం

చిరుధాన్యాలతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని కృషివిజ్ఞాన కేంద్రం (కెవికె) ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ టిఎస్ఎస్కె పాత్రో అన్నారు. మంగళవారం మండలంలోని రస్తా కుంటుబాయ్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఒడిశాకు చెందిన 20 మంది రైతులకు చిరుధాన్యాల విలువలు ఆధార ఉత్పత్తులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన చిరుధాన్యాల పంటలను ఏవిధంగా వేయాలి వాటి వల్ల రైతులకు ఎంత ఉపయోగకరంగా ఉంటుంది, ఎలా లాభాలు ఆర్జించాలి, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పిటిసి సభ్యులు కన్నతల్లి

ప్రతిఒక్కరికీ ఉపాధి

ప్రజాశక్తి - వీరఘట్టం

వలసలు నివారించేందుకు ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నట్టు జెడ్పిటిసి సభ్యులు జంపు కన్నతల్లి ఉమామహేశ్వర రావు అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని కత్తుల కవిటిలో ఉపాధి హామీ గ్రామసభ జరిగింది. కత్తుల కవిటి సచివాలయ పరిధిలోని 34 రకాల పనులకు సంబంధించి రూ.కోటీ 18 లక్షలతో పనులు కల్పించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఉపాధి పనుల్లో పాల్గొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.సరోజిని, ఎపిఒ జి.సత్యంనాయుడు, ఎంపిటిసి సభ్యులు కె.పరిమిల, ఉపాధిహామీ సిబ్బందితో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బుద్దేశ్వరరావు నిర్వహించారు. సుమారు 250 మందికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం హెచ్పి కౌంట్ తక్కువ ఉన్నవారికి ఐరన్ టాబ్లెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీవరం, వైస్‌ప్రిన్సిపల్ రామయ్య, జువాలజీ లెక్చరర్ డాక్టర్ శాంత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంఆఫీసర్ త్రినాధ, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బకాయి వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజన ప్రాంత ఆసుపత్రుల్లో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులకు ఇవ్వాల్సిన పెండింగ్ జీతాలు తక్షణమే ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ కోరారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పదినెలలుగా జీతాలివ్వకపోవడమేమిటని ప్రశ్నించారు. కురుపాంలో హిజ్రాలకు సామాజిక భవనం నిర్మాణం కోసం ఏడు సెంట్లు భూమి ఇవ్వాలని కోరారు. జిల్లాలో సీఆర్పీలకు బదిలీలు జరిగి రెండు నెలలు గడిచినా ఎందుకు రిలీవ్ చేయలేదని ప్రశ్నించారు. పన్నెండేళ్ల తర్వాత బదిలీలు జరిగినా ఫలితం లేకుండా పోయిందని, తక్షణమే సిఆర్పిలను రిలీవ్ చేయాలని కోరారు. విజయనగరంలో జిల్లాలో లేని ఇబ్బంది మన్యం జిల్లా విద్యాశాఖలో ఏమిటని ప్రశ్నించారు. అలాగే ఇప్పటికీ అనేక గిరిజన గ్రామాల్లో పోడు భూములకు పూర్తి స్థాయిలో పట్టాలివ్వలేదని, వెంటనే పట్టాలు ఇవ్వడానికి రెవెన్యూ, అటవీశాఖ, ఐటిడిఎ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జెఎఎస్‌ను వినియోగించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - సాలూరు

జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ కోరారు. మండలంలోని కందులపదంలో జగనన్న ఆరోగ్య సురక్ష(జెఎఎస్) కార్యక్రమం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. జెఎఎస్ కౌంటర్లను, వైద్యులు, సిబ్బంది హాజరు, చికిత్స కోసం వచ్చిన ప్రజలు, వైద్య సేవలను కలెక్టర్ పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది ప్రజలకు ఉత్తమ సేవలందించాలని సూచించారు. జగనన్న ఆరోగ్య సురక్ష (జెఎఎస్) కార్యక్రమం నిరుపేదలు, దూర ప్రాంతాల ప్రజలకు ఒక గొప్ప వరమని, నిపుణులైన వైద్యులు తమ వద్దకు వచ్చి వైద్య సేవలందించడం జరుగుతుందని వివరించారు. కావున ఈ వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.బాలమురళీకృష్ణ, ఎంపిడిఒ జి.పార్వతి, డెప్యూటీ డిఎంహెచ్ఒ శివకుమార్, డాక్టర్ ఎం.మహేష్, కె.శ్రీకాంత్, సర్పంచ్ టి.జోగమ్మ, ఎంపిటిసి సభ్యులు జె.సీతారామ్, సాలూరు మెడికల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని నర్సిపురంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కర్రి గోవిందరావు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వీటిని వినియోగించుకుని ఆరోగ్య వంతులుగా ఉండాలన్నారు. అనంతరం వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచు కర్రి సత్యవతి, ఎంపిటిసి సభ్యులు కె.ప్రశాంతి, ఎంపిడిఒ జిజె ప్రసాద్, వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, ఎ.మానస, వెంకటరమణ, సచివాలయ కార్యదర్శి జి.రూప, వైద్య, సచివాలయ సిబ్బందితో పాటు వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ అకిబ్‌జావేద్ అన్నారు, మండలంలోని బాలగొడబలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ముందుగా శిబిరాన్ని సందర్శించి రోగులతో మాట్లాడి వైద్యం అందుతున్న తీరును గమనించారు. వైద్యులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పోలమ్మ, పండు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.గురురాజు, తహశీల్దార్ శివన్నారాయణ, ప్రభుత్వ వైద్యాధికారులు, వైద్యులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని లక్ష్మీపురం గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్‌రెడ్డి పరిశీలించారు. అలాగే 465 మందికి తనిఖీలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పిటిసి ఎం.బాబ్జీ, ఎంపిపి బి.రమణమ్మ, వైద్యాధికారులు ఎం.రాధాకాంత్, ఎం.ఉషారాణి, వైద్యులు, సర్పంచ్ తుమ్మపల్లి సత్యవతి ఎంపీటీసీ టి.పార్వతి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సీతానగరం : ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

సాలూరు : కేస్ షీట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పొలంగూడను సందర్శించిన డిఎంహెచ్ఒ

కురుపాం : జిల్లా వైద్య అధికారి బి.జగన్నాధరావు నీలకంఠాపురం పిహెచ్‌సి పరిధిలోగల పొలంగూడ గిరిజన గ్రామాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన పచ్చకామర్లతో బాధపడి పసరమందు తాగి వికటించి ఇద్దరు చిన్నారులు మృతిచెందిన సంఘటన తెలిసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారులతో కలిసి గ్రామానికి వెళ్లారు. మృతికి గల కారణాలు తెలుసుకొని ఆ గ్రామస్తులకు మూఢనమ్మకాలు, పసరు మందులు వాడొద్దని ఏవైనా ఆరోగ్య సమస్యలు వస్తే సంబంధిత పిహెచ్‌సికి వెళ్లాలని సూచించారు. అనంతరం జి.శివడసచివాలయంలో జరుగుతున్న జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెద్యాధికారులు బి.ప్రజ్ఞ, పి.అభినవ్ కుమార్, కె.వెంకట హర్ష, సరళ దేవి (జనరల్ మెడిసిన్), పి.పర్ధన్ బ్యన్ (శ్వాసకోస) వైద్య నిపుణులు పాల్గొన్నారు.

బంగార్రాజు ఆశయ సాధనకు కృషి : సిపిఎం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో సిపిఎం అభివృద్ధికి కృషి చేసిన మాజీ సర్పంచ్, సిపిఎం సీనియర్ నాయకులు కిల్లక బంగార్రాజు ఆశయ సాధనకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు సూచించారు. బంగార్రాజు 13వ వర్ధంతిని మండలంలోని బీరుపాడు పంచాయతీ ఇజ్జకాయిలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేణు మాట్లాడుతూ బంగార్రాజు కమ్యూనిస్టు పార్టీలో చేరిన నాటి నుంచి చనిపోయే వరకు గిరిజనుల పక్షాన ఉండి సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. ఆయన పోరాటాల ఫలితంగా ఏజెన్సీలో చాలామందికి రేషన్ కార్డులు, పింఛన్లు, ప్రభుత్వం నుంచి రుణాలు అందాయని గుర్తు చేశారు. బంగార్రాజు ఆశయాలు, లక్ష్యాలు కలకాలం నిలవాలంటే ప్రతి కార్యకర్త పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్ మాట్లాడుతూ గిరిజనులకు ఏ ఒక సమస్య ఉన్న అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించడంలో కీలకపాత్ర వహించారన్నారు. ఎర్రజెండా నీడలో ఆయన ఉద్యమాలు, పోరాటాలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి మండంగి రమణ, సిపిఎం నాయకులు పువ్వల మోహన్ రావు, సన్యాసిరావు, తిరుపతి రావు, శ్రీనివాసరావు, శంకర్రావు పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.


సంతాప సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

ఐటిడిఎ పరిధిలో గల ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌జిటి, సిఆర్‌టి, టిజిటిలకు స్థానిక బాలికల ఆశ్రమం ఉన్నత పాఠశాలలో శిక్షణ నిర్వహించారు. ఈ వృత్యాంతర శిక్షణ కార్యక్రమాన్ని డిడి జి.మంగవేణి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఈ శిక్షణ వినియోగించుకొని గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందాలని సూచించారు. డిప్యూటీ డిఇఒ ఎ.లిల్లీ రాణి మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు సులభ పద్ధతిలో పాఠాలు బోధించాలన్నారు. ఈ శిక్షణలో ఎఎంఒ పి.కోటిబాబు, సిఎంఒ చిరంజీవులు, జిసిడిఒ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినబోగిలికి చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమంగా మద్యంబాటిళ్లను తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నీలకంఠం తెలిపారు. ఒక్కొక్కరి దగ్గర 18బాటిళ్లు చెప్పున 36బాటిళ్లు స్వాధీనం చేసుకుని, వారిద్దర్ని కోర్టుకు తరలించామని తెలిపారు. ఎస్ఐతో పాటు మహిళా పోలీస్ సుజాత పాల్గొన్నారు.

సచివాలయం వద్ద బైఠాయించిన గ్రామస్తులు

తాగునీరు ఇచ్చే వరకూ కదిలేది లేదు

సిపిఎం ఆధ్వర్యంలో సచివాలయం వద్ద మహిళల నిరసన

ప్రజాశక్తి -కొమరాడ

మండల కేంద్రంలో ప్రజలకు తాగునీరిచ్చే వరకూ నిరసన కార్యక్రమం చేపడతామని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో మహిళలతో కలిసి తాగునీరు అందించాలని కోరుతూ నిరసన చేపట్టారు. అనంతరం సాంబమూర్తి, రజక వీధికి చెందిన పెంట లక్ష్మి (నారాయణమ్మ), గడ్డెమ్మ మాట్లాడుతూ రజక వీధుల్లో 20 రోజులుగా తాగునీరు రావడంలేదని, మంచినీరు బోర్లు గానీ, జలజీవన్ ద్వారా గానీ మంజూరు చేసిన పైపులు నుండి గానీ నీరు పూర్తిస్థాయిలో రాకపోవడంతో చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉందని అన్నారు. కొన్ని రోజుల పాటు రెండు రజక విధులకు చెందిన ప్రజలు నీరు పూర్తి స్థాయిలో అందక ఇబ్బంది పడుతుంటే కనీసం సచివాలయం సిబ్బంది పరిశీలించకపోవడం అన్యాయమని అన్నారు. కావున వెంటనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని జలజీవన పథకం ద్వారా గానీ, పాత కొళాయి నుండి బోరుల ద్వారా గానీ తాగునీరందించాలని డిమాండ్ చేశారు. లేకుంటే సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రజక వీధి మహిళలు, పాత బిసి కాలనీకి చెందిన మహిళలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

ప్రజాశక్తి - కురుపాం

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా జిల్లాలో వివిధ రూపాల్లో నిరసన వ్యక్తమవుతున్నాయి. పలువురు నిరసనదీక్షలు చేపట్టగా, మరికొన్ని చోట్ల కరపత్రాలు పంపిణీ, ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద టిడిపి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్ కుమార్, ఎస్టీ సెల్ అధికార ప్రతినిధి కృష్ణబాబు, మాజీ సర్పంచ్ రామరాజు, టిడిపి నాయకులు కన్నా, బి.రామకృష్ణ, కర్రి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో మండలంలోని ఎమ్మార్‌నగరంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ముందుగా గ్రామంలోని పలు ఆలయాల్లో సామూహిక ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు జి.వెంకట నాయుడు, అధ్యక్ష కార్యదర్శులు దొగ్గ మోహన్‌రావు, బోను చంద్రమౌళి, చంటి, చిన్నరామినాయుడు, బసవ మన్మథరావు, రెడ్డి చంటి, బుడితి శ్రీరాం, పలు పంచాయతీలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : చంద్రబాబునాయుడు నిర్దోషిగా బయటకు రావాలని కోరుతూ మండలంలోని తోటపల్లిలో గల వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు జరిగాయి. టిడిపి మండల అధ్యక్షులు ఎ.మధుసూదనరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పురుషోత్తమ నాయుడు, అంబటి తవిటి నాయుడు (రాంబాబు) ఎంబి విజయ అంకుశం, కోటా సుమన్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జియ్యమ్మవలస మండలం పెదబుడ్డిడిలో ఈశు ్వడికి అభిషేకం చేశారు. అనంతరం గ్రామంలో ప్లే కార్డులు పట్టి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు పల్ల రాంబాబు, టిడిపి అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, ఎస్టీ సెల్ అరుకు పార్లమెంటు అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు, కురుపాం నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు గురానా శ్రీరామ్మూర్తినాయుడు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస మండలం పెద్దబుడ్డిడిలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

పాలకొండ : చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా మండలంలోని చింతాడ, అట్టలిలో కరపత్రాలను టిడిపి నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు గండి రామినాయుడు, మాజీ సర్పంచ్ కాశీ నాయుడు, నాయకులు జాడ శ్రీధర్, మీసాల శ్రీనివాసరావు, బెజిపురం శశికళ, మజ్జి రాజు, గోపాలనాయుడు, మజ్జి సుభద్రమ్మ, పాల్గొన్నారు.

సీతంపేట : చంద్రబాబు నాయుడును అక్రమ అరెస్టు చేశారని టిడిపి మండల అధ్యక్షులు సవర తోట మొకలింగం, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బి.చంద్రరావు కార్యకర్తలు పలి పుట్టి సమీపంలో ఉన్న పోలమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సాలూరు: చంద్రబాబు నాయుడును విడుదల చేయాలని కోరుతూ స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ఇంఛార్జి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్ ఆధ్వర్యాన పట్టణ, మండల నాయకులు ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, పట్టణ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మహిళలు వారికి ఉపయోగపడే చట్టాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని దిశా డిఎస్‌పి ఆర్ హర్షిత విద్యార్థులతో అన్నారు. మంగళవారం స్థానిక శ్రీకృష్ణ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు పోక్సో చట్టాలు, చెడు, మంచి స్పర్శలు, సైబర్ నేరాలు, పిల్లల నడవడికపై తల్లిదండ్రులు తీసుకోవాల్సిన ప్రత్యేక శ్రద్ధ తదితర అంశాలపై అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ పోక్సో చట్టాలు బాలికలకే కాకుండా బాలురకు కూడా వర్తిస్తాయని, పిల్లలు ఎక్కువగా ఆన్లైన్ గేమ్స్‌కు అలవాటుపడుతున్నారని, దీనివల్ల అనేక దుష్పరిణామాలు ఎదుర్కుంటున్నారని అన్నారు. కావున తల్లిదండ్రులు వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ వారికి తగిన సమయాన్ని కేటాయించి వారిని ఒంటరిగా ఉండకుండా చూడాలని అన్నారు. అలాగే పిల్లలు ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా వారి తల్లిదండ్రులకు, సంరక్షకులకు సమాచారాన్ని తెలియజేయాలని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లల నడవడికను పర్యవేక్షిస్తూ వుండాలని సూచించారు. దిశా యాప్ , సైబర్ నేరాలు, మహిళలకు ఉపయోగపడే చట్టాలు, మహిళలపై జరుగుతున్న నేరాల దృష్ట్యా వాటిని అరికట్టడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో దిశా పోలీస్ స్టేషన్ ఎస్ఐ లావణ్య,హెడ్ కానిస్టేబుల్ లావణ్య, పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిఎస్‌పి హర్షిత

హెచ్ఎంకు చెక్కును అందజేస్తున్న దినేష్‌కుమార్

పేద విద్యార్థులకు సాయం

ప్రజాశకి - గుమ్మలక్ష్మీపురం

పేద విద్యార్థులకు తన వంతు ఏదో సహాయం చేయాలన్న తపనతో తాను విద్యను అభ్యసించిన పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు తనవంతు సహాయంగా తాను పనిచేస్తున్న కెనరా బ్యాంకు సిఎస్ఆర్ నిధుల నుంచి రూ.22,500 ఆర్థిక సహాయాన్ని దినేష్ కుమార్ అందించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు తన తోటి విద్యార్థి, మిత్రుడు, ప్రస్తుతం పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్న బర్నికల మురళీధర్‌రావు సహాయంతో ఆరుగురు విద్యార్థులకు ఉన్నత చదువుల నిమిత్తం రూ.22,500 చెక్కుల రూపంలో అందించారు. ఉన్నత విద్యను అభ్యసించాలన్న సంకల్పం ఉన్న విద్యార్థులు, తల్లిదండ్రుల లేని విద్యార్థులకు తన వంతు సహాయంగా ఈ చిరు సహాయాన్ని అందించానని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిడ్డిక భీముడు, ఉపాధ్యాయులు సీతన్న, మురళీధర్ రావు, కూర్మారావు తదితరులు ఉన్నారు.

వట్టిగెడ్డ ఎడమ కాలువ ద్వారా సాగునీరు

ప్రజాశక్తి - పార్వతీపురం

జియ్యమ్మవలస రైతుల స్ఫూర్తితో వట్టిగెడ్డ ఎడమ కాలువ ద్వారా సాగునీరు లభించింది. గతంలో సాగునీటి సమస్యపై అధికారులకు ఎన్నో దఫాలుగా అర్జీ పెట్టుకున్నప్ప టికీ పరిష్కారం కాని తమ సమస్య జగనన్నకు చెబుదాం ద్వారా ఫలించిందని రైతులు తెలిపారు. సాగు నీరందక పంటలన్నీ దెబ్బతినే పరిస్థితికి చేరుకున్నాయి. ఈ తరుణంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వట్టిగెడ్డ ఎడమ కాలువ ద్వారా సాగు నీరు పంట పొలాలకు అందడంలేదని, కాలువను బాగుచేసి నీరు సరిగ్గా అందేలా చూడాలని కలెక్టరు నిశాంత్ కుమార్‌కు ఆ గ్రామ రైతులు అర్జీ సమర్పించారు. అర్జీపై కలెక్టర్ తక్షణమే స్పందిస్తూ సమస్యకు పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రూ.44.85 కోట్లు జైకా నిధులు మంజూరయ్యాయని, ఈ నిధులతో ప్రోజెక్టు పరిధిలోని ఎడమ ప్రధాన కాలువ అభివృద్ధి, లైనింగ్ చేయు పనులు చేపట్టనున్నట్లు అధికారులు కలెక్టరుకు వివరించారు.

సాలూరు-మక్కువ రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - సాలూరురూరల్

సాలూరు-మక్కువ రోడ్‌కు ఆర్అండ్‌బి అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. 'ప్రజాశక్తి'లో ఆదివారం ప్రచురితమైన 'ఈ రోడ్డు బాగుపడేదెప్పుడో..' అన్న వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు మంగళవారం రోడ్డుపై ఉన్న గుంతల్లో క్రషర్ బూడిద వేసి తాత్కాలికంగా పుడ్చారు. దీంతో ప్రయాణికులకు కొంత వరకు ఉపశమనం కలిగింది.

పోరుకు సిద్ధంగా ఉండాలి

ప్రజాశక్తి -సీతంపేట

చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ నేపథ్యంలో వైసిపి వివిధ కార్యక్రమాలతో ప్రజలలోకి వెళ్లేందుకు యత్నిస్తుందని, దీన్ని తిప్పికొట్టేందుకు నిరసన కార్యక్రమాలతో పాటు వైసిపి వైఫల్యాలను ఎండగుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని టిడిపి నాయకులు పడాల భూదేవి పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల పోరుకు సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. అలాగే ఓటర్ల జాబితా ఎప్పటికప్పుడు పరిశీస్తుండాలని తెలిపారు. ఎటువంటి ప్రలోభాలకు తలొగ్గవద్దని కోరారు. మానసికంగా దెబ్బతీసేందుకు తప్పుడు కథనాలను ప్రసారం చేస్తుంటారని, వాటిని చూసి అధైర్య పడొద్దన్నారు. ఎన్ని అవంతరాలు సృష్టించినా 2024 లో టిడిపి ప్రభుత్వమే నని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి సవర కుంపి, అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి యస్ మాలయ్య, మాజీ సర్పంచ్ గంగయ్య, నాయకులు మంగయ్య, సవర బాలరాజు, శిమ్మయ్య, మాసయ్య, మల్లేష్, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లేడు కషాయంతో పోషకాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

జిల్లేడు కషాయంతో పంటలకు పోషకాలు సమృద్ధిగా ఉంటాయని ప్రకృతి వ్యవసాయం ఎన్ఎఫ్ఎ గొల్లు అన్నపూర్ణ అన్నారు. మండలంలోని సంతోషపురం రైతు భరోసా కేంద్రం వద్ద మంగళవారం జిల్లేడు కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 400 లీటర్లు జిల్లేడుద్రావణం తయారు చేయడం జరిగిందన్నారు. 100 లీటర్ల నీటిలో 20కేజీలు జిల్లేడు ఆకులు, 20లీటర్ల గోవు మూత్రం కలిపి 48గంటలు మురగనివ్వాలన్నారు. పత్తి, అరటి, వరి ఏపంటలోనైనా పొట్ట దశలో జిల్లేడు ద్రావణం పిచికారీ చేస్తే వరిలో గింజ బరువు, అరటి, పత్తిలో కాయలు ఏపుగా పెరుగుతాయన్నారు. వీటితో పాటు తెగుళ్లు, పురుగుల నివారణ కూడా జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న గ్రామాల్లో ఈ విధంగా తయారు చేయడం జరుగుతుందని, ఆర్‌బికెల్లో సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎ.హరీష్, మండలం ఇన్‌ఛార్జి వి.పోలినాయుడు, శ్రీను, రైతులు లక్ష్మి, నారాయణమ్మ పాల్గొన్నారు.

వండువ మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక ఎమ్మెల్యే విశ్వాస రాయి కళావతి చిన్నాన్న, వండువ మాజీ సర్పంచ్ విశ్వాస రాయి లక్ష్మీనారాయణ చిన్న దొర (76) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆయన మంగళవారం శ్వాస విడిచారు. ఆయనకు భార్య విజయలక్ష్మితో పాటు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండు సార్లు సర్పంచిగా, షుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్‌గా పనిచేయగా, ప్రస్తుతం డిసిసిబి డైరెక్టర్ కొనసాగుతున్నారు. ఆయన అకాల మరణంతో ఎమ్మెల్యే కళావతి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మృతికి ప్రభుత్వ విప్ పి.విక్రాంత్, ఎంపిపి డి వెంకటరమణనాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు జంపు కన్నతల్లి ఉమామహేశ్వరరావు, సర్పంచి మిడతాన కళ్యాణి, గ్రామస్తులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని బంగారమ్మ కాలనీకి చెందిన కొండంగి రవికుమార్ మంగళవారం తన స్కూటీపై పాచిపెంట వెళ్తుండగా సీతానగరం మండలం కాశీపేట- పనుకువలస రోడ్డు కూడలి వద్ద రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బొబ్బిలి నుంచి పార్వతీపురం వైపు వస్తున్న కారు స్కూటీని ఢీకొనడంతో రవికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఔట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.